క్లుప్తంగా

రక్తదానం సమాజ బాధ్యత


ప్రసంసా పత్రాలను అందిస్తున్న ప్రిన్సిపాల్

కార్వేటినగరం: రక్తదానం సమాజ బాధ్యతని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజియులురెడ్డి అన్నారు. గురువారం కళాశాలలో రెడ్‌రిబ్బన్ క్లబ్, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా స్విమ్స్ బ్లడ్ బ్యాంకు సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం తో సమానమని తెలిపారు. స్విమ్స్ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి డాక్టర్ సురేష్ మాట్లాడుతూ రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలు, అపోహలను వివరించారు. 42 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వారికి సర్టిఫికెట్లను అందించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడా సామగ్రిని అందిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ లత అన్నారు. గురువారం ప్రభుత్వం అందజేసిన క్రీడాసామగ్రిని మండలంలోని 80 పాఠశాలలకు పంపిణీ చేశారు. స్థానిక భవిత కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకే ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ మోహన్‌మురళి మాట్లాడుతూ క్రీడా సామగ్రితోపాటు పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేందుకు పెనాయిల్, రూమ్ స్ప్రే, ఫ్లోర్ క్లీనర్ వంటి అధునాతన పరికరాలకు అందించినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఏఈ నాగభూషణం, హెచ్‌ఎంలు, పీడీలు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని గొల్లపల్లె వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రకాష్, కృప వివాహానికి గురువారం ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఇంకా పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


రామనాథరెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

పాలసముద్రం: పాలసముద్రం ఎంపీడీఓగా రామనాథరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పుంగనూరు నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపి సత్కరించారు.

నేడు తుపాను బాధితులకు ప్రభుత్వ సాయం

నగరి: తుపాను తాకిడికి జలదిగ్బంధంలో చిక్కుకున్న వేలావడి ఎస్టీకాలనీ వాసులకు ప్రభుతం నుంచి సాయం అందుతున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, ఒక లీటరు పామోలిన్ ఆయిల్ చొప్పున 70 కుటుంబాలకు అందిస్తామన్నారు. షాపు నంబరు 1045037 నుంచి బాధితులకు అందించడం జరుగుతుందని తెలిపారు.

ఓం శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు



పాలసముద్రం: మండలంలోని ఆముదాల పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామంలోని ఓం శక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాల ధరించిన భక్తులు అమ్మవారి శూలానికి వివిధ అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి దీపారాధన చేశారు. అనంతరం ఇరుముడి కట్టుకుని మేల్‌మరవత్తూరు ఆదిపరాశక్తి అమ్మవారి దర్శనానికి బయలు దేరారు.

వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు

- జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు


వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

నగరి: తుపాన్ కారణంగా పలు ప్రాంతాల్లో వర్షపు నీరు ప్రవహించడం, కాలువల్లో నీరు పొంగి పొర్లడం లాంటివి జరిగాయని దీంతో కీటకాలు వ్యాప్తిచెందేందుకు ఆస్కారం ఉన్నందున వైద్యసిబ్బంది వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలనిజిల్లా మలేరియా అధికారి ఎల్.శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండలంలోని బుగ్గ అగ్రహారం మున్సిపల్ పరిధిలోని పుదుపేట నార్త్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో ఉన్న ల్యాబ్‌లను క్షుణంగా పరిశీలించి, టెక్నీషియన్లకు తగిన సూచనలు చేశారు. సిబ్బందితో సమావేశమైన ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమకాటు వల్ల వచ్చే జ్వరాలైన డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా మొదలగు వ్యాధుల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. నీటి నిల్వలలో లార్వాలు పెరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జ్వర పీడితులకు రాపిడ్ కిట్ ద్వారా గానీ, స్లైడ్ ద్వారా గానీ వ్యాధి నిర్ధారణ చేసి ట్రీట్‌మెంట్ ఇవ్వాలన్నారు. సూపర్‌వైజర్లు ఫీల్డ్‌లో తనిఖీలు చేపట్టి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రపరిచేలా చేయాలన్నారు. ఫ్రై డే డ్రై డే పక్కా జరిగే విధంగా చూడాలన్నారు. ఏఎన్‌ఎంలకు ఇచ్చిన వెక్టార్ హైజీన్ యాప్‌ను అప్‌డేట్ చేయించే విధంగా వారికి తోడ్పాటు అందించాలన్నారు. డిప్యూటీ డీఈఎంఓ జయరామయ్య మాట్లాడుతూ గర్భకాలంలో లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన కఠిన శిక్షలకు గురి కాగలరన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, సూపర్ వైజర్‌లు, ఏయన్‌యంలు, ఆశాలు, యంయల్‌హెచ్‌విలు పాల్గొన్నారు.

వరిలో మెలకువలు పాటించాలి


వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పాలసముద్రం: తుపాన్‌తో దెబ్బతిన్న వరి పంటకు తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని చిత్తూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కె.రాఘవేంద్ర, నాగమణి తెలిపారు. సీఎం కండ్రిగలో తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటను గురువారం వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్‌తో కలసి పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిని కాలువల ద్వారా బయటకు పంపాలని తెలిపారు. నేలకొరిగిన వరిని ఆరిన తరువాత కుప్పలుగా కట్టి, గింజ రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉండేందుకు ఉప్పు ద్రావణం 50 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మానిపండు తెగులు నివారణకు గింజ పాలు పోసుకునే దశలో ప్రొఫికొనజోల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు వనజ, మధుసుదన్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ


కంటి అద్దాలు అందుకున్న విద్యార్థులు

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం 27 మంది విద్యార్థులకు సీహెచ్‌వో శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు సుబ్బరత్నమ్మ కంటి అద్దాలు పంపిణీ చేశారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో విద్యార్థులకు కంటి సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 27 మందికి కంటి అద్దాలు అవసరమని వైద్యులు సిఫార్స్ చేయడంతో ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అద్దాలను అందజేసింది. ఈ సందర్భంగా వైద్యుల బృందం విద్యార్థులకు కంటి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించింది. కంటి వైద్య నిపుణురాలు రమీలా, వైద్య సిబ్బంది స్వరూప, సుమతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ సంకల్ప యాత్ర

పెనుమూరు(కార్వేటినగరం): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించేందుకే వికసిత్ సంకల్ప యాత్ర చేపడుతున్నట్లు ఎంపీడీవో నీలకంఠేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని గంగుపల్లె, సామిరెడ్డిపల్లెలో వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర పథకాలను వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు జమున, వ్యవసాయ అధికారి కల్యాణ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

నింద్ర: మండలంలో తుపాను కారణంగా దెబ్బతిన్న పంటలను తిరుపతి రాస్ విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రెడ్డిరాము, నగరి వ్యవసాయ డివిజన్ ఏడీఏ సౌభాగ్యలక్ష్మి పరిశీలించారు. గురువారం వారు నింద్ర, అగరం, నెట్టేరి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాలకు దెబ్బతిన్న వరి, వేరుశనగ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. వరి పంటలో, వేరుశనగ పంటలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వేరుశనగ పంటలో పచ్చపురుగు ఉంటే తొలిదశ మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ తులసీరాం, రైతులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శ్రీనివాసులు

నింద్ర: మండలంలోని ఓటరు నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల పరిధిలో బీఎల్‌ఓలు తమ పనితీరును వేగవంతం చేయాలన్నారు. సమస్యలు ఉంటే వీఆర్‌ఓ, తహసీల్దార్లు పర్యటించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, తహసీల్దార్ భగవతి, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏసు మార్గం అనుసరణీయం


కేక్ కట్ చేస్తున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి, తమిళ నటుడు సెంథిల్, పాస్టర్ మహిమై దాస్


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డెప్యూటీ సీఎం

గంగాధర నెల్లూరు: ఏసు ప్రభువు సూచించిన శాంతి, దయ, ప్రేమ అనుసరణీయమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఈడెన్ గార్డెన్‌లో మహిమై చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, పాస్టర్ మహిమైదాస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణ స్వామి, తమిళ హాస్య నటుడు సెంథిల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. భారీ కేక్‌ను డిప్యూటీ సీఎం కట్ చేసి, అందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో క్రిస్టియన్లు, పాస్టర్లు విచ్చేశారు. పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం పాస్టర్, ప్రముఖ కొరియోగ్రాఫర్ మహిమైదాస్ హీరో, నిర్మాతగా వాసుదేవ దర్శకత్వంలో నిర్మిస్తున్న డాంకీ క్యారీ ది వరల్డ్ చిత్రం వాల్ పోస్టర్‌ను డెప్యూటి సీఎం, నటుడు సెంథిల్ ఆవిష్కరించారు. మండల ఉపాధ్యక్షుడు హరిబాబు, సీడీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేల్కూరు బాబు రెడ్డి, పాస్టర్ పాల్ రాజ్, మాజీ సర్పంచ్ కుట్టి పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలనలోనే సంక్షేమం


పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

గంగాధర నెల్లూరు: అన్ని వర్గాల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, అలాంటి పాలన కావాలంటే మళ్లీ ఆయన ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని పాపిరెడ్డిపల్లె సర్పంచ్ పార్థసారథిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి తెలిపారు. గురువారం పాపిరెడ్డిపల్లె సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 99 శాతం హామీలను ముఖ్యమంత్రి నెరవేర్చారని తెలిపారు. పాపి రెడ్డిపల్లె పంచాయతీ పరిధిలో పథకాలు, అభివృద్ధి కింద రు.20 కోట్లను ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం పథకాలను వివరించే బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, ఈవోపీఆర్డీ రాఘవేంద్ర రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ వెంకటేష్ రెడ్డి, సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బొమ్మయ్యపల్లెలో దారి సమస్య పరిష్కారం


దారిని చదును చేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ చిన్నబొమ్మయ్యపల్లె నుంచి బొమ్మయ్యపల్లె దళితవాడకు వెళ్లే బండి బాట సమస్య డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో పరిష్కారం అయ్యింది. గత 12 సంవత్సరాలుగా రెండు గ్రామాలకు చెందిన వారు విభేదాలతో అభ్యంతరాలు సృష్టించుకుని దారి లేకుండా చేసుకున్నారు. ఇటీవల బొమ్మయ్యపల్లె సచివాలయ పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో దారి సమస్యను ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి దృష్టికి దళితులు తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ గోవిందయ్యను ఆదేశించారు. దీంతో సర్పంచ్ రెండు గ్రామాల ప్రజలతో మాట్లాడి ఒప్పించడంతో గురువారం జేసీబీతో పాటు ఆరు ట్రాక్టర్ల ద్వారా చదును చేసి గ్రావెల్ తోలి రోడ్డు వేశారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పుత్తూరులో పంట పొలాల పరిశీలన


రామసముద్రంలో రైతుకు సూచనలిస్తున్న ఏఓ కోదండయ్య


తిరుమలకుప్పంలో వేరుశనగ రైతుకు సూచనలు ఇస్తున్న ఏఓ

పుత్తూరు: తుపాను కారణంగా పుత్తూరు మండలంలో విస్తృతంగా వర్షాలు కురిసినప్పటికీ పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. తూర్పు మండలాల్లో సాధారణంగా వరి నాట్లు ఆలస్యంగా వేస్తుంటారు. ఈ నేపథ్యంలో పుత్తూరు మండలంలో వరి నాట్లు వేసి కేవలం 20 రోజులు మాత్రమే అవుతోంది. అందులోనూ వరి పంట కావడంతో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయాధికారి కోదండయ్య తెలిపారు. రామసుముద్రం, తొరూరు గ్రామాల్లో పది ఎకరాల్లోని వరి పంటలో నీరు నిలిచిందన్నారు. ఆయా రైతుల వద్దకు వెళ్లి నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అలాగే వరి పంటలో నీరి నిల్చిన రైతులు ఎకరాకి 15 కేజీలు పొటాషియం, 30 కేజీలు యూరియా వేయడం ద్వారా పంటను తెగుళ్ల బారిన పడకుండా రక్షించుకోవచ్చని సూచించినట్లు వివరించారు. వేరుశనగ పంటకు సైతం ఎలాంటి నష్టం వాటిల్లలేదని స్పష్టం చేశారు. మామిడి పంటలో పూత దశే ప్రారంభం కాని నేపథ్యంలో ఈ పంటకు వచ్చిని నష్టం ఏమీలేదని హార్టికల్చర్ ఆఫీసర్ వెంకటసౌజన్య తెలిపారు.

సంక్షేమానికి అధిక ప్రాధాన్యత


సిమెంటురోడ్డుకు భూమిపూజ చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- గడప గడపలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నాం
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి: సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని కరకంతాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షల వ్యయంతో మూడు ప్రాంతాల్లో నిర్మించే సిమెంటు రోడ్లకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరుగుతోందన్నారు. గడప గడపకు పర్యటిస్తూ తెలుసుకున్న సమస్యలను గడపగడపకు నిధులు రూ.20 లక్షల వ్యయంతో పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. కరకంతాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించే సమయంలో స్థానిక ప్రజలు రోడ్డు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని, వాటిని ఇప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే రోడ్డు అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, కౌన్సిలర్లు చినపాప, బీడీ భాస్కర్, భూపాలన్, యాకోబు, ఇంద్రయ్య, మురుగ, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, ఆనందకుమార్, మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి, డీఈ నరేష్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు



తిరుమలలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సినీ నటుడు అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి దర్శించుకున్నారు. గురువారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు తిరుమల శ్రీవారిని ప్రముఖ టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ భార్య కుటుంబ సభ్యులు స్నేహారెడ్డి దర్శించుకున్నారు. ఆలయం వెలుపల డిప్యూటీ సీఎం నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ.. కులాలను ప్రోత్సహించే వ్యక్తులు మారాలని, కులవృత్తులు కాకుండా విద్యావంతులు, ఆర్థిక, రాజకీయ ఇబ్బందులు లేకుండా పేదవాడు కూడా ఉన్నత విద్య అభ్యసించేలా చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై శ్రీవారి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు.

దివ్యాంగులకు అండగా నిలవాలి


బహుమతులను అందిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: ప్రత్యేక ప్రతిభావంతులపై వివక్ష చూపడం నేరమని, వారికి అండగా నిలిచి ఆదరించాలని ఎంపీపీ లత అన్నారు. గురువారం అంతర్జాతీయ ప్రత్యేక ప్రతిభా వంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక భవిత సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ భవితలో అందించే ఫిజియో థెరఫీని సద్వినియోగం చేసుకుని దివ్యాంగులు మామూలుస్థితికి చేరుకోవాలని తెలిపారు. ప్రత్యేక ప్రతిభావంతులను తల్లిదండ్రులు భారంగా భావించకూడదని, వారికి ఇష్టమైన రంగాన్ని గుర్తించి ప్రోత్సాహిస్తే వారు రాణిస్తారని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయకుమార్ మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వం ప్రత్యేక వైద్య సౌకర్యాలు కల్పించిందని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు భవిత కేంద్రాల్లో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ భవిత కేంద్రం వద్ద ర్యాంపు ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు నాగభూణమ్మ, కిరణ్‌కుమార్, ఏఈ నాగభూషణంతో పాటు అనేక మంది ఆర్థిక సహాయాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు ఎంపీపీ బహుమతులను అందించారు. సర్పంచ్ ధనంజయవర్మ, ఎంపీడీవో మోహన్‌మురళీ, ఆర్కేఎస్సార్ హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాయత్రీదేవీ, సహిత ఉపాధ్యాయులు సింధుజ, రేఖ, ఉపాధ్యాయులు ధనంజయులు, పలువురు సీఆర్పీలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు భరోసా భవిత కేంద్రం

పాలసముద్రం: ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగుల ఎదుగుదలకు అండగా నిలుస్తోందని ఎంఈఓ గిరిజ, హెచ్‌ఎం మీనాక్షి తెలిపారు. గురువారం పాలసముద్రం భవిత కేంద్రంలో ఐఈఆర్‌టీ బాలాజీ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. క్రీడా పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు వెంకటేష్, కోదండయ్య, ఉపాధ్యాయురాలు వనజ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయండి



మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, క్రీడాసామగ్రిని అందిస్తున్న ఎంపీడీఓ

వెదురుకుప్పం: ఈనెల15 నుంచి ప్రారంభమయ్యే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పెరుమాళ్లపల్లె సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్ర కింద నమోదైన రిజిస్ట్రేషన్లతో పాటు క్రీడా మైదానాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామ సచివాలయ పరిధిలో క్రీడా మైదానాలను సిద్ధం చేసుకోవాలన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో 220 మందిని రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఇప్పటి వరకు 2,400 మంది ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు.ఈఓపీఆర్డీ పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, సర్పంచ్ శశికుమారి, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యం

పెనుమూరు(కార్వేటినగరం): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆడుదాం.. ఆంధ్రా క్రీడా సామగ్రిని సచివాలయాలకు పంపిణీ చేశారు. అధికారులు పూర్ణచంద్రారెడ్డి, కరుణాకరన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రశంస


క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి రోజా

నగరి: అంతర్‌జిల్లాల ఎస్జీఎఫ్ అండర్‌-14 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ప్రశంసించారు. ఇటీవల జరిగిన అంతర్‌జిల్లాల ఎస్‌జీఎఫ్ బాల్ బ్యాడ్మింటన్‌లో అండర్‌-14 విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలిచింది. జట్టు సభ్యులు గురువారం మంత్రి రోజా నివాసానికి వెళ్లి కలిశారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఆమె ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, పీడీ గోపి, క్రీడాకారులు లక్ష్మీనారాయణ, ఎస్.రక్షణ్, కె.సిద్దిక్ పాల్గొన్నారు.



మాంగాడు చెరువుకు జలకళ

గత మూడు రోజులుగా భారీగా కురిసిన వర్షాలకు మాంగాడు చెరువు పూర్తిగా నిండి కలుజు పారుతోంది. ఏదాది తరువాత కలుజు పారుతుండడంతో యువకులు నీటిలో ఆనందంగా సందడి చేశారు. కొందరు చేపల వేట ప్రారంభించారు.

-నగరి